

భద్రత కల్పించాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు గ్రామాల్లో గల విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి. 24 గంటల పాటు ప్రజలకు వైద్యం అందించేందుకు అందుబాటులో ఉంటున్న వైద్య సిబ్బందిపై కొన్నిమార్లు రోగుల బంధువులు పలు చోట్ల దాడులకు దిగే ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇటువంటి ఘటనలతో వైద్యులతో పాటు వైద్య సిబ్బందిలో ఆందోళన ఉంటుంది. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇటువంటి వైద్య సిబ్బందికి ఉద్యోగ భద్రతను కల్పించాలి.

– పి.త్రినాథ్, హెల్త్ అసిస్టెంట్, ఎ.కోడూరు, కె.కోటపాడు మండలం



చట్టాలను కఠిన తరం చేయాలి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయకపోతే దాడులు జరుగుతూనే ఉంటాయి. ఇటీవల కొల్‌కతా ట్రైనీ డాక్టరుపై దుండగులు జరిపిన సంఘటన తలుచుకుంటే చాలా బాధేస్తుంది. ప్రజలకు వైద్యం చేసే వైద్యాధికారులకు రక్షణ లేకపోతే ప్రాణాలు ఎలా నిలబెడతారు. రాత్రి సమయంలో సైతం మహిళా డాక్టర్లు స్టాఫ్ నర్సులు పీహెచ్‌సీలో అత్యవసర సమయాల్లో రోగులకు వైద్య సేవలు అందిస్తుంటారు. అలాంటి సమయాల్లో ఇటీవల జరిగిన సంఘటనలను బట్టి చూస్తే విధిగా పోలీసులు రక్షణ ఉండకపోతే వారు ధైర్యంగా పని చేయలేరు.

ఎం.రాజేష్‌నాయుడు, వైద్యాధికారి నాతవరం పీహెచ్‌సీ

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి రూ.20 వేలు వితరణ



మారేపల్లిలో బాధితులకు నగదును అందజేస్తున్న సత్యవేణి నాయుడమ్మ

దేవరాపల్లి: మండలంలోని మారేపల్లిలో ఇటీవల మృతి చెందిన అల్లు అప్పారావు కుటుంబానికి జనసేన నాయకులు బాసటగా నిలిచారు. రాయపురెడ్డి కృష్ణ, గొర్రుపోటు రామూర్తినాయుడు తదితర నియోజకవర్గ జనసేన నాయకులు సమకూర్చిన రూ. 20 వేల నగదును మారేపల్లికి చెందిన జనసేన నాయకురాలు అవుగడ్డ సత్యవేణి నాయుడమ్మ చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు.

శంకరంలో సోలార్ దీపాల పంపిణీ



శంకరం గ్రామంలో సోలార్ దీపాలు అందజేస్తున్న పరమేశ్వరావు తదితరులు

మాడుగుల రూరల్: గిరిజన పంచాయతీ అయిన శంకరం గ్రామంలో బుధవారం సోలార్ దీపాలు పంపిణీ చేశారు. సౌత్ ఏసియా ఎల్‌పీజీ కంపెనీ ఆధ్వర్యంలో, కంపె నీ ప్రతినిధి రామ్‌నాథ్ ఆధ్వర్యంలో 1500 మందికి జిల్లా బీజేపీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పరమేశ్వరావు మాట్లాడు తూ గ్రీన్ ఎనర్జీ కార్యక్రమంలో భాగంగా సోలార్ దీపాలు పంపిణీ చేసినట్టు తెలిపారు.విద్యుత్, బ్యాటరీ అవసరం లేకుండా కేవలం సోలార్‌తోనే వెలుతురు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోలం రమేశ్, పార్టీ సీనియర్ నాయకుడు, మాడుగుల మాజీ సర్పంచ్ దంగేటి సూర్యారావు, మండల పార్టీ అధ్యక్షుడు ఉందూరు రాజు, పార్టీ ప్రధాన కార్యదర్శి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ

గొలుగొండ: గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిహెచ్‌వో బి.జె.వి.ప్రసాద్ వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని పప్పుశెట్టిపాలెంలో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలతో మాట్లాడి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. నిరంతరం వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు.

రీ సర్వేలో అన్యాయం



తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించిన తాతీలు

రోలుగుంట : బుచ్చింపేటకు చెందిన రెడ్డి తాతీలు తన భూమి విషయంలో జరిగిన అన్యాయంపై బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద తన కుమార్తెలతో బైఠాయించి నిరసన తెలిపారు. రీసర్వేకు ముందు ఆన్‌లైన్‌లో ఉన్న భూమిని వెబ్ ల్యాండులో తొలగించి మొత్తం భూమిని తాతీలు కున్న ముగ్గురు కుమార్తెల్లో ఒకే కూతురుపై నమోదు చేసి మిగిలిన వారికి తెలియకుండా ఆమెకు వీఆర్వో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చారు. ఈ విషయం ఆలస్యంగా తెలుసుకున్న భూ యజమాని తనకు జరిగిన అన్యాయంపై మిగిలిన కుమార్తెలతో కలిసి నిరసనకు దిగారు. బుచ్చింపేట గ్రామ రెవెన్యూలో 73,74,70/3, 72/1, 142 లో మొత్తం 3ఎకరాల 10 సెంట్ల భూమి ఉంది. రీసర్వేలో గ్రామ రెవెన్యూ అధికారి, సర్వేయర్లు మామూళ్లు తీసుకొని మొత్తం భూమిని తన పెద్ద కుమార్తె అయిన పోతల లక్ష్మి పేరు మీద ఆన్‌లైన్ చేసి పాస్‌పుస్తకాలు జారీ చేశారన్నారు. వీటిని రద్దు చేసి తమకు న్యాయం చేయాలని బుధవారం తహసీల్దార్ కె.వరహాలుకు విన్నవించాడు.

కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక

చోడవరం రూరల్ : స్థానిక ఐ డ్రీమ్ నేత్రాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 14 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వీరికి సహాయకులుగా మరో 12 మందితో విశాఖలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రికి తరలించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, ఉపాధ్యక్షుడు సాంబశివరావు, సర్వీస్ చైర్మన్ రమేష్, సత్యనారాయణ తదితరులు సహకారం అందించారు.

ఖాళీ స్థలాలు.. నిర్లక్ష్యానికి ఆనవాళ్లు

పట్టణ ప్రాంతంలో అడుగు జాగా లేక, సొంత గూడు లేక మురికివాడల్లో తలదాచుకునే అభాగ్యులెందరో ఒకవైపు, విలువైన ఖాళీ స్థలాలను ఎటువంటి సంరక్షణ లేకుండా, అభివృద్ధి లేకుండా, శుభ్రత లేకుండా గాలికొదిలేసే మోతుబరులు మరోవైపు. పురపాలక సంస్థ పరిధిలో వందలాది ఖాళీ స్థలాలు ఎటువంటి అభివృద్ధికి నోచకుండా, మురుగుకూపాలుగా మిగిలిపోతున్నాయి. యజమానుల నిర్లక్ష్యం ఒకవైపు, అధికారుల నిర్లిప్తత మరోవైపు..వెరసి పట్టణంలో పారిశుధ్య సమస్యకు కారణమవుతున్నాయి. దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా, విషసర్పాలకు నిలయాలుగా మారుతున్నాయి.

- అపరిశుభ్రతకు నిలయాలు
- చెరువులను తలపిస్తున్న వైనం
- పట్టణ వాసులను వెంటాడుతున్న దోమల బెడద



భవనాల మధ్య చెరువులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు

నర్సీపట్నం: పురపాలక సంఘం పరిధిలో ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిలిచి మురుగు కూపాలుగా మారుతున్నాయి. జనావాసాల నడుమ ఉన్న ఈ స్థలాల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. మరి కొన్ని స్థలాలు పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రతతో దోమలు, విషసర్పాలుగా నిలయంగా మారి చుట్టు పక్కల నివసిస్తున్న వారికి తీవ్రంగా ఇబ్బంది కలిగిస్తున్నాయి. మొదట్లో మున్సిపల్ అధికారులు ఖాళీ స్థలాలను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసేవారు. ఇది సత్ఫలితాలు ఇచ్చేది. రాను రాను ఖాళీ స్థలాల విషయాన్ని మున్సిపల్ అధికారులు గాలికి వదిలేశారు. దీంతో వర్షాలు కురిసినపుడు ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండి చెరువులను తలపిస్తున్నాయి. చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు వాటి నుంచి వెలువడే దుర్వాసన, దోమలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత నెల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు ఖాళీ స్థలాలపై చర్యలు తీసుకోవాలని కౌన్సిల్‌లో ప్రస్తావించినా క్షేత్రస్థాయిలో చర్యలు కానరాలేదు. మున్సిపాలిటీలో బ్యాంకు కాలనీ, శారదనగర్, వెంకునాయుడు, తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఆయా ఖాళీ స్థలాలు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. నివాస గృహాల మధ్య ఉన్న ఈ స్థలాల్లో నీరు నిల్వ ఉండి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. మరోవైపు ఆయా స్థలాలు విషసర్పాలకు నిలయాలుగా మారాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచిపోవడం వల్ల దోమలు పెరిగి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో ఖాళీ స్థలాలు వందల్లో ఉన్నాయి. 2016–17లో ఖాళీ స్థలాలపై పన్ను రూపంలో రూ.3.9 లక్షలు ఆదాయం వచ్చింది. తరువాత వచ్చిన అధికారులు ఈ విషయాన్ని గాలికి వదిలేసారు. గతంలో పదిశాతం స్థలాల్లో మాత్రమే పురపాలక అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అటువంటి చర్యలు కానరావడం లేదు.

మండల సమావేశంలో సమస్యల ఏకరువు

- అధికారుల తీరుపై ఆరోపణలు
- శాఖల పనితీరు నివేదిక ముందే ఇవ్వాలన్న ఎమ్మెల్యే రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

చోడవరం: పలు సమస్యలను సభ్యులు మండల సమావేశంలో ఏకరువు పెట్టారు. మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసు అధ్యక్షతన చోడవరం మండల సమావేశం బుధవారం జరిగింది. కొన్ని శాఖల అధికారుల నిర్లక్ష్యం పని తీరు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుందని మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి. శ్యామ్‌సుందర్ మండల పరిషత్ నివేదికను చదివి వినిపించిన అనంతరం ఒక్కో శాఖ వారీగా పనితీరు నివేదిక ఉంచారు. రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, విద్యుత్, ఐసీడీఎస్ శాఖల పనితీరుపై పలువురు సభ్యులు సమావేశంలో ఫిర్యాదు చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా కాలువ పనులు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా నేటికీ మెయిన్‌రోడ్డు పనులు చేపట్టలేదని, పెద్దపెద్ద గోతులు పడడంతో రోడ్డు అంతా ప్రమాదకరంగా ఉందని ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు.ఇక నుంచి మండల సమావేశంలో నివేదించే శాఖల వారీ నివేదికను ముందుగానే ముద్రించి సభ్యులకు అందజేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అలా చేయడం వల్ల ఏ శాఖ పనితీరుపై సభ్యులకు ఇబ్బంది ఉంటే ముందుగానే సమస్యను ఆ శాఖ దృష్టికి తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. మంచినీటి సమస్య లేకుండా ఇప్పటికే ఇంటింటి కుళాయిలు వేశామని, అవసరమైన చోట్ల చేతి బోర్లు కూడా వేస్తామన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ తిరుమలబాబు, వైస్ ఎంపీపీలు బైన ఈశ్వరరావు, బుద్ద గంగరాజు, ఈఓఆర్‌డీ చైతన్య, మండల పరిషత్ సూపరింటెండెంట్ అమ్మాజి పాల్గొన్నారు.

విద్యుత్ అమరవీరులకు ఘన నివాళులు

మాడుగుల రూరల్ : దాదాపు 24 ఏళ్ల క్రితం విద్యుత్ ఛార్జీల పెంపుపై ఆందోళన సందర్భంగా హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోలీసు కాల్పుల్లో మృతి చెందిన అమరవీరులకు బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక కనికరమాత కాలనీలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి మాట్లాడుతూ 2000 ఆగస్టు 28వ తేదీన శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న పోరాట యోధులపై అప్పటి టీడీపీ ప్రభుత్వం కాల్పులు జరపడం అనుమానుషమని మండల సీపీఎం కార్యదర్శి ఇరటా నర్సింహమూర్తి పేర్కొన్నారు. కాల్పుల్లో అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు నివాళులు అర్పించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని నాడు అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తున్న తరుణంలో నాటి దేశం ప్రభుత్వం భాష్పవాయువు ప్రయోగించి, గుర్రాలతో తొక్కించి కాల్పులు జరపడం వల్ల ముగ్గురు మృతి చెందారని అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుదల అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో బొట్టా కన్నారావు, బొట్టా సంతోషి, రెడ్డి వెంకట్రావు, బొట్టా మౌనిక పాల్గొన్నారు.



మాడుగుల కనికరమాత కాలనీలో అమర వీరులకు నివాళులు అర్పిస్తున్న నర్సింహమూర్తి తదితరులు

దేవరాపల్లి : విద్యుత్ సమస్యలపై పోరాడుతూ అమరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటాలకు దేవరాపల్లిలో సీపీఎం నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర మాట్లాడుతూ పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని 2000 ఆగస్టు 28న అఖిల పక్షం ఆధ్వర్యంలో ఉద్యమించగా ప్రభుత్వం భాష్పవాయువు ప్రయోగించడంతో పాటు గుర్రాలతో తొక్కించి, కాల్పులు జరపడంతో ముగ్గురు మరణించారన్నారు. అమరుల పోరాట స్ఫూర్తితో విద్యుత్ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కమిషనర్ సురేంద్ర బాధ్యతల స్వీకారం

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా జె.సురేంద్ర బుధవారం బాధ్యతలు చేపట్టారు. జీవీఎంసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తూ బదిలీపై వచ్చారు. గతంలో 2016 జూన్ నుంచి 2019 ఫిబ్రవరి వరకు నర్సీపట్నం మున్సిపల్ కమిషనర్‌గా పని చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మిని మర్యాద పూర్వకంగా కలిసారు. బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌కు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్తామన్నారు. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కౌన్సిల్ వారి సూచన మేరకు మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రధానంగా మున్సిపాలిటీలో శానిటేషన్, విద్యుత్ నిర్వహణ మెరుగుకు చర్యలు తీసుకుంటామన్నారు.



మున్సిపల్ కమిషనర్ సురేంద్రకు అభినందనలు తెలుపుతున్న కార్యాలయ సిబ్బంది

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి గడువు పెంపు

దేవరాపల్లి : దేవరాపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న మూడు అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి ఈ నెల 30 వరకు గడువు పొడిగించామని ప్రిన్సిపాల్ బి.రాధ తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 30 సాయంత్రం 4 గంటల్లోగా స్థానిక కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. జువాలజీ పోస్టుకు ఎంఎస్సీ జువాలజీ, కంప్యూటర్ సైన్స్ పోస్టుకు బీటెక్ కంప్యూటర్స్, జీఎఫ్‌సీకి ఎంఏ ఎకనామిక్స్ (రూరల్ డెవలప్‌మెంట్)లో యాభై మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తామని తెలిపారు.

వికసిత్ ఆంధ్రా 2047పై వర్క్ షాపు



మెప్మా సిబ్బందితో సమావేశమైన పీడీ ఎన్.సరోజిని

నర్సీపట్నం: స్థానిక మెప్మా కార్యాలయంలో బుధవారం మెప్మా పీడీ ఎన్.సరోజిని వికసిత్ ఆంధ్రా 2047పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో పేదరికంలో నివసిస్తున్న సభ్యులను గుర్తించి వారితో సంఘాలు ఏర్పాటు చేసి, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి జీవనోపాధికి బాటలు వేయాలన్నారు. రుణాలను వ్యాపారంలో పెట్టుబడి పెట్టించి ఆర్థికంగా ఎదిగేలా చూడాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నైబర్‌హుడ్ బిజినెస్ యూనిట్ యాప్ ద్వారా సర్వే చేసి గుర్తించిన వారి వివరాలను నమోదు చేయాలన్నారు. సొంతంగా వ్యాపారాలు చేస్తున్న వారికి మెప్మా మిషన్ ద్వారా ముద్ర రుణాలు ఇప్పించి పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాలన్నారు. వారు తయారు చేసే ఉత్పత్తులకు ఓపెన్ నెట్‌వర్క్ డిజిటల్ కమర్షియల్ యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ఆన్‌లైన్ షాపింగ్ అవుతుందన్నారు. టిడ్కో గృహాల వద్ద ప్రజల సౌకర్యార్థం సంఘ సభ్యులతో లైవ్లీహుడ్ సెంటర్లు, అర్బన్ మార్కెట్‌లు స్థాపించి అక్కడ జరిగే అమ్మకాలకు డిజిటల్ పేమెంట్ జరిగేటట్లు చూడాలని సూచించారు. వర్క్‌షాపులో కోఆర్డినేటర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

శంకరం పంచాయతీలో భూ ఆడిట్‌కు డిమాండ్



పంచాయతీలో రైతులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

మాడుగుల: మండలంలోని శంకరం పంచాయతీలో భూ ఆడిట్ నిర్వహించాలని, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్. అజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మాడుగుల మండలం శంకరం పంచాయతీలో పర్యటించిన ఆయన ఆదివాసీలను కలుసుకుని మాట్లాడారు. అనకాపల్లి జిల్లాలో అత్యధిక శాతం బంజరు భూములు, సీలింగ్ భూములుండగా శంకరంలో కూడా ఉన్నాయని గుర్తు చేశారు. ఈ అవాస గ్రామాలన్నీ ఆదివాసీ రైతులతో నిండి ఉన్నాయన్నారు. కానీ నేడు ఈ భూములు జిల్లాయేతర రైతుల సాగులోకి వెళ్లిపోతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని చెబుతుందని, ఈ సభల్లో సర్వే చేసి అర్హులైన వారికి భూములు ఇప్పించాలని డిమాండ్ చేశారు. పెద్దేరు నిర్వాసితులకు కూడా భూములు ఇప్పించాలని అన్నారు.

బాధిత కుటుంబానికి రూ.9 లక్షల సాయం

కె.కోటపాడు: మండలంలో సూర్రెడ్డిపాలెం గ్రామానికి చెందిన కింతాడ కృష్ణ(48) లారీ ఢీకొని విశాఖపట్నంలో ఈ నెల 26న మృతిచెందాడు. మృతుడు కృష్ణ విశాఖపట్నం శ్రావణి షిప్పింగ్ కంపెనీలో లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. గత సోమవారం రాత్రి కె.ఆర్.సన్స్‌కు చెందిన లారీ ఢీకొట్టడంతో ఆయన మృతిచెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చెయ్యాలని ఆయుష్మాన్ ఆస్పత్రి వద్ద సీఐటీయూ నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేశారు. దీంతో బాధిత కుటుంబానికి శ్రావణి షిప్పింగ్ యాజమాన్యం రూ.9 లక్షలు అందించేందుకు ముందుకు వచ్చిందని సీఐటీయూ అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము తెలిపారు. మృతుడి భార్య పాపయ్యమ్మకు రూ.5 లక్షల నగదు, మిగిలిన నగదుకు సంబంధించిన బ్యాంక్ చెక్కును బుధవారం అందించిందన్నారు. అలాగే ప్రమాదానికి కారణమైన లారీ నుంచి బీమా పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటామని కంపెనీ నిర్వాహకులు హామీ ఇచ్చినట్టు రాము తెలిపారు. సూర్రెడ్డిపాలెంలో కృష్ణ మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు జరిపారు. విశాఖపట్నం సీఐటీయూ జిల్లా నాయకులు ఎం.సుబ్బారావు, మరదాన రవి, బుజ్జి, సతీష్, సన్యాసిరావు పాల్గొన్నారు.



మృతుడు కృష్ణ భార్యకు నగదు, చెక్కును అందిస్తున్న దృశ్యం

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

చీడికాడ : ఎయిడ్స్ నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా హెచ్ఐవీ, ఎయిడ్స్‌ను పూర్తిగా పారదోలవచ్చునని, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో బుధవారం చీడికాడలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో సంస్థ సీఎల్‌డబ్ల్యు పి.సూర్యకళ పేర్కొన్నారు. చీడికాడ హైస్కూల్లో విద్యార్థినులకు హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆదేశాల మేరకు ఈ సంస్థ 'మీకు తెలుసా' కార్యక్రమంలో భాగంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఐవీ రోగుల పట్ల వివక్ష తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కలిగించి తద్వారా ఎక్కువ మందిని హెచ్ఐవీ పరీక్షలు చేయించుకోనేలా చైతన్య పరుస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సింహాచలం, ఆశ కార్యకర్త చిన్నమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మంచాల, చీడికాడ గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

సమర్థంగా సంపద తయారీ కేంద్రాల నిర్వహణ

దేవరాపల్లి : చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలన్నింటినీ వినియోగంలోకి తీసుకువచ్చి సమర్థవంతంగా నిర్వహించాలని దేవరాపల్లి ఇంచార్జ్ ఎంపీడీవో కె.చంద్రశేఖర్ పంచాయతీ అధికారులకు సూచించారు. ఈ మేరకు రైవాడ, ఎం.అలమండ, గరిశింగి గ్రామాల్లో గల చెత్త నుంచి సంపద కేంద్రాల్లో వానపాములను విడుదల చేశారు. రైవాడలో స్థానిక సర్పంచ్ చల్లా లక్ష్మితో కలిసి సంపద కేంద్రంలో వానపాములను బుధవారం విడుదల చేశారు. ఆయా కేంద్రాల్లో వర్మీ కంపోస్టు తయారీతో పంచాయతీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు.



రైవాడ సంపద కేంద్రంలో వానపాములను విడుదల చేస్తున్న సర్పంచ్ చల్లా లక్ష్మి, ఎంపీడీవో చంద్రశేఖర్

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్



గర్భిణులకు ఆరోగ్య తనిఖీలను నిర్వహిస్తున్న వైద్యాధికారి శైలజ

కె.కోటపాడు : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు రక్తహీనత సమస్యను అధిగమించవచ్చునని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి శైలజ అన్నారు. ఆర్.వై.అగ్రహారం గ్రామంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 137 మందికి ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మందులు ఇచ్చారు. గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు జరిపి జాగ్రత్తలను వివరించారు. గర్భిణులు, కిశోర బాలికలు పప్పు దినుసులు, ఆకుకూరలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవించం శ్రేయస్కరమని వైద్యాధికారిణి శైలజ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు, ఎంఎల్‌హెచ్‌పీ మంగవేణి, ఏఎన్ఎం.రాము, హెల్త్ అసిస్టెంట్ ఆర్.గంగాధర్‌రావు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై చర్యలు

కె.కోటపాడు : గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులతో పాటు పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.అప్పలరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శి, డిజిటల్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే పరిస్థితులు ఉన్న దృష్ట్యా పారిశుధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేరు చేసి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలని అన్నారు.